

ఒప్పందం పత్రాలను పరస్పరం అందచేసుకుంటున్న ఇన్‌కాయిస్ డైరెక్టర్ నాయక్, ఎ.యు. వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల రెడ్డి. నగర మేయర్ జనార్ధనరావు చిత్రంలో ఉన్నారు

# ఎ.యు, ఇన్‌కాయిస్‌ల మధ్య ఒప్పందం

విశాఖపట్నం, మార్చి 26: సాగర సమాచార సేవా జాతీయ కేంద్రం (ఇన్‌కాయిస్)తో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒప్పందాన్ని సోమవారం ఇక్కడ కుదుర్చుకుంది. సాగర పరిశోధనలకు ఉపయోగపడే ఉపగ్రహ సమాచారాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం తన పరిశోధనలకు ఉపయోగించుకునేందుకు వీలుగా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మచిలీపట్నం నుంచి విశాఖ వరకూ ఉన్న సముద్ర తీర ప్రాంతంలో మత్స్యకారులకు కావాల్సిన సమాచారాన్ని, సాగర శాస్త్రంపై అధ్యయనాలు చేసేందుకు కావాల్సిన సమచారాన్ని ఈ కేంద్రం సమకూరుస్తుంది. సాగర సంబంధ విషయాలపై అధ్యయనం చేసేందుకు కూడా ఒప్పందం కుదుర్చుకున్నారు. మచిలీపట్నం నుంచి విశాఖ వరకూ ఉన్న కోస్తా ప్రాంతంలో 2.4 లక్షల మంది మత్స్యకారులకు ఈ ఒప్పందం వల్ల లాభం చేకూరే వీలు ఉంది. సముద్రం లోతు, చేపల ఉనికి, సముద్ర పరిస్థితి వంటి విషయాలను మత్స్యకారులకు తెలియడం ద్వారా చేపల వేట ఎక్కువగా లాభించే అవకాశం ఉంది. సముద్ర ఉపరితలంలో క్లోరోఫిల్ ఉనికి గుర్తించడం ద్వారా చేపలు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని సులభంగా గుర్తించేందుకు ఈ కేంద్రం అందించే సమాచారం దోహదపడుతుంది. ఈ ఒప్పందంపై ఎ.యు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వేణుగోపాలరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విజయప్రకాష్, ఇంకోయిస్ డైరక్టర్, డాక్టర్ శైలేష్ నాయక్, మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ పులుసు జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.